# కేసీఆర్ కోలుకోవాలని ఆలయాల్లో పూజలు



రోకడ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



సాలూరా మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 9 : మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ కంఠేశ్వర్‌లోని రోకడ హనుమాన్ ఆలయంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు శనివారం పూజలు చేశారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రమణారావు, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ శంకర్, రమణారావు, జీవన్‌రావు, వెంకట్రావు, హర్షవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**వేల్పూర్ బీసీ కాలనీలో..**

వేల్పూర్, డిసెంబర్ 9: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ రేగుల రాములు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**సాలూరా మండల కేంద్రంలో..**

బోధన్ రూరల్, డిసెంబర్9: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ సాలూరా మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సన్న ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల గుండెల్లో ఉన్న వ్యక్తి కేసీఆర్ అని, భగవంతుడు ఆయనకు త్వరగా కోలుకునే విధంగా ఆశీస్సులు అందజేయాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ ఎల్మదత్తు, శివకాంత్‌పటేల్, వెంకట్‌పటేల్, డిస్కో సాయిలు, శ్రీరామ్, గంగాధర్ పాల్గొన్నారు.



వేల్పూర్‌లో పూజలు చేస్తున్న నాయకులు



నవీపేట మండలంలో లింగాపూర్‌లో..

**లింగాపూర్ గ్రామంలో..**

నవీపేట, డిసెంబర్ 9: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో సర్పంచ్ బత్తూర్ సాయిలు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీరడి బుచ్చన్న, నాయకులు పోశెట్టి, జలంధర్, కల్లెం రాములు, ఒడ్డెన్న, గాండ్ల పోతన్న, సాయిలు, విజయ్, గంధం రవి, కల్లెం సాయిలు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ



బాధిత కుటుంబానికి నిత్యావసర సకులను పంపిణీ చేస్తున్న గిరిజన ఉద్యోగులు

బోధన్ రూరల్, డిసెంబర్ 8: బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి శనివారం పలువురు నిత్యావసర పంపిణీ చేశారు. ఆరు నెలల క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లి శివారులో మృతి చెందిన కుటుంబానికి ఊట్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన ఉద్యోగులు 10 క్వింటాళ్ల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో బాధిత కుటుంబాలకు నిత్యావసరుకులను అందజేశారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగులు స్వామినాయక్, కిషన్, వసంత్, పుష్పలత, ఆర్. సంతోష్, డి.వి రాంజీ, గ్రామ పెద్దలు డి.వి సంతోష్, మధుకర్, జట్‌ఫట్ బాబు, గోవింద్, పరశురాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



సిరికొండలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బోధన్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 9 : కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. జక్రాన్‌పల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అర్గుల్ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో, రూరల్ మండలం మల్లారంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సిరికొండ మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బకారం రవి ఆధ్వర్యంలో, ఇందల్వాయి బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. రుద్రూర్‌లో బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వర్నిలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు చేశారు. నందిపేట్, ఆలూర్, ఆర్మూర్, బోధన్, నవీపేట, రెంజల్, ఏర్గట్ల తదితర మండలాలతోపాటు బోధన్, ఆర్మూర్ పట్టణంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానలో కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. బోధన్ పట్టణంలోని గంజ్ కమాన్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు.

## నవీపేటను కమ్మేసిన పొగమంచు



నవీపేటలో పొగమంచులో వాకింగ్ చేస్తున్న, మహిళలు విద్యార్థులు

నవీపేట,డిసెంబర్9: మండల కేంద్రంలో శనివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. కమ్మేసిన పొగమంచుతో మండల ప్రజలు, సంతకు వచ్చే వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం మేకల సంతకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు పొగమంచుకు దారి స్పష్టంగా కన్పించక కొంత ఇబ్బందులు పడ్డారు. తెల్లవారు జామునే వాకింగ్‌కు వెళ్లే క్రమంలో విద్యార్థులు, మహిళలు, యువకులు ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం ఎనిమిది గంటల వరకు పొగ మంచు వీడక పోవడంతో ప్రజలు పనులను సమయానికి చేసుకోక లేక పోయారు. రెండు రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది.

## రేపు గంగహారతి

నందిపేట్, డిసెంబర్ 9: మండలంలోని పాతూర్ ఉమ్మెడ గ్రామం గోదావరి నది వద్ద ఈనెల 11న గంగహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రాముడు పోశెట్టి శనివారం తెలిపారు. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ సమక్షంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య సాయంత్రం వేళ గోదావరి నదికి హారతి ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతకుముందు మధ్యాహ్నం ఉమామహేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

## పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్



ప్రయోగాన్ని వివరిస్తున్న విద్యార్థులు

మాక్లూర్, డిసెంబర్9: గుత్ప సీపీఆర్ఎంఎస్ పాఠశాలలో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఒక విద్యార్థి ఉపాధ్యాయుడిగా మారి ఒక విషయంపై ఇతర విద్యార్థులకు బోధిస్తాడని కరస్పాండెంట్ సత్యానందం తెలిపారు. దీంతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, టాలెంట్, నాలెడ్జ్, కాన్ఫిడెన్స్ మెరుగుపడుతుందన్నారు. జిల్లా ట్రస్మా అధ్యక్షుడు జయసింహగౌడ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రశాంత్‌రెడ్డి విజయానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు

మోర్తాడ్, డిసెంబర్ 9: నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు పార్టీ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి చూపించి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించాలని ఎన్నో కుట్రలు జరిగినా ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని అన్నారు. ప్రజల కష్టాలను తీర్చడానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందని చెప్పారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బాల్కొండ, డిసెంబర్ 9: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో పనికి రాని ప్లాస్టిక్ డబ్బాలు, కుండలు, కొబ్బరి చిప్పలను తొలగించారు. వాటిలో నీరు నిలిస్తే దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధులపాలు అవుతారని పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది లత, కృష్ణవేణి, మాధవి పాల్గొన్నారు.



టైరులోని నీటిని తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది